ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మహబూబాబాద్
బుధవారం 27 ఆగస్టు 2025
5



గణపతి పూజకు వేళాయె..

నేడే వినాయక చవితి...

- భారీగా విగ్రహాల విక్రయాలు.. ఉత్సవాలకు సిద్ధమైన మండపాలు
- మానుకోటలో మోగనున్న గణపతి నామస్మరణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహా గణపతి.. గణాధిపత్యం పొంది.. మమ్మలను ఆశీర్వదించేందుకు రావయ్యా అంటూ జిల్లా వ్యాప్తంగా వినాయక పూజలకు ప్రజలు సిద్ధమయ్యారు. సకల విఘ్నాలు తొలగించి సిరులు కురిపించే వినాయకుడి పూజలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణ కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఊరూరా వివిధ రంగులతో ముస్తాబుచేసిన మండపాల్లో నేడు గణనాథులు కొలువుదీరనున్నారు.

ముస్తాబైన మండపాలు..

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. టెంట్ సామగ్రిని తీసుకువచ్చి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలను వివిధ రూపాల్లో, రంగురంగుల డిజైన్‌లతో అలంకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. విద్యుత్ కాంతుల నడుమ మండపాలను తీర్చిదిద్ది నేడు వినాయక చవితిని పురస్కరించుకుని ఉత్సవ కమిటీలు ఆయా మండపాలలో గణనాధుడి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. జిల్లా వ్యాప్తంగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు 383ల మండపాలకు చెందిన నిర్వాహకులు పోలీసుల అనుమతి పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు.

పెరిగిన విగ్రహాల ధరలు..

ఈ ఏడాది నవంబరు నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుతాయనే నేపథ్యంలో వినాయక విగ్రహాల ధరలను కూడా భారీగానే పెంచినట్లు తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తరఫున నాయకులు, కార్యకర్తలు జిల్లా, పట్టణ, మండల, గ్రామాల్లో యువత, స్వచ్ఛంద సంస్థలచే వినాయక

(మిగతా 8లో..)



మహబూబాబాద్ అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు





నెహ్రూసెంటర్‌లో విక్రయిస్తున్న వినాయక పూజ సామగ్రి



మహబూబాబాద్‌లోని బాలాజీ స్వీట్ హౌస్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన లడ్డూలు

అన్నదాతలు అధైర్య పడొద్దు

- రైతులకు సరిపడా యూరియా అందిస్తాం
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఎవరు అధైర్యపడవద్దని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికి సరిపడ యూరియాను అందిస్తుందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతుకు యూరియా అందించేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్దంగా ఉందని చెప్పారు. యూరియా విషయంలో బీఆర్ఎస్ నేతల మాటలు చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ సలహాదారులు వేం. నరేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావును కలిసి నియోజకవర్గంలో యూరియా కొరత విషయాన్ని వారికి వివరించానని పేర్కొన్నారు. ఈ నెల 28 కల్లా నియోజకవర్గంలోని రైతులందరికి సరిపడా యూరియా అందేలా చూస్తామని హామి ఇచ్చారని, ఎవరు ఆందోళన చెందవద్దని ప్రతి ఒక్క రైతుకు యూరియా అందుతుందని తెలిపారు.

యూరియా కొరత.. రైతుల కలత

అందని ఎరువుతో ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు 6



మహబూబాబాద్ జిల్లా గూడూరు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలి

- గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యహరిస్తూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనలు అతిక్రమిచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, పెండింగ్ కేసులపై మరింత చొరవ చూపి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని సమావేశపుహాల్‌లో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల వారీగా కేసుల నమోదు, పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేటి నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి ఉత్సవాలు విగ్రహ ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీలతో సమన్వయంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి, పీడీఎస్ బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మారకద్రవ్యాల నివారణలో భాగంగా స్థానిక పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో బీట్ సిస్టమ్‌ను మరింత మెరుగుపర్చాలన్నారు. జిల్లాలో సైబర్ నేరాలు క్రమేపి పెరుగుతున్నాయని నివారణకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి బ్లాక్ స్పాట్స్‌గా సూచిక బోర్డులను ఏర్పాటు చేయించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా సహించరాదన్నారు. సమావేశంలో డీఎస్పీలు తిరుపతిరావు, క్రిష్ణకిషోర్, శ్రీనివాస్, ఎస్‌బి ఇనిస్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, టౌన్, రూరల్ సీఐలు మహేందర్‌రెడ్డి, సర్వయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 482 గ్రామపంచాయతీల్లో ఓటర్ల జాబితాను వార్డుల వారీగా సిద్ధం చేయడంతో పాటు పోలింగ్ స్టేషన్లను గుర్తించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 28న జిల్లాలోని గ్రామపంచాయతీల ఓటర్ల జాబితాను వార్డుల వారీగా పూర్తి చేసి పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయాలన్నారు. 29న జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి 30న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపాలని సూచించారు. 31న జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎదుట ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని ఆదేశించారు. సెప్టెంబరు 2న తుది ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

యూరియా కొరత.. రైతుల కలత



కేసముద్రం సొసైటీ ఎదుట యూరియా టోకెన్ల కోసం బారులు తీరిన రైతులు

అందని ఎరువుతో ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

మహబూబాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా ఇక్కట్లు తప్పేట్లు లేదు.. సరిపడా యూరియా ఉందని అధికారులు చెబుతుండగా అన్నదాతలకు అందించడంలో మాత్రం కనపడడం లేదు.. టోకెన్లు ఇచ్చి వారం దాటినా యూరియా ఇవ్వడం లేదని రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. అదను దాటితే ఉన్న పంట చేతికి రాదు.. యూరియా అందించడాలని తమ గోడు వెల్లబోసుకుంటున్నాడు. మహబూబాబాద్ పీఏసీఎస్ వద్ద యూరియా బస్తాల కోసం రైతులు పెద్ద సంఖ్యలో క్యూలైన్ నిలబడ్డారు. వర్షం రావడంతో ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్న వద్ద క్యూలైన్‌లో నిల్చున్న వారికి టోకెన్‌లను అందించి 450 యూరియాను పంపిణీ చేశారు.

● గూడూరు : పీఏసీఎస్ ఎదుట వందలాది మంది రైతులు యూరియా బస్తా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో నిలబడ్డారు. మొత్తం 1200 మంది రైతులు రాగా, కేవలం 352 యూరియా బస్తాలు మాత్రమే వచ్చాయి. పోలీసుల బందోబస్తు నడుమ ఒక్కో రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున అందించారు. గూడూరు సోసైటీకి మంగళవారం 352 బస్తాలు రాగా, 1200 మందికి పైగా రైతులు యూరియా కోసం తరలివచ్చారు. 352 మంది రైతులకు యూరియా అందించగా యూరియా బస్తాలు రాని రైతులు నిరాశతో ఇంటిముఖం పట్టారు.

● మరిపెడ : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద యూరియా కోసం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా జరిగింది. మాజీ మంత్రి రెడ్యానాయక్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులను సీఎం రేవంత్‌రెడ్డి అరిగోస పెడుతున్నాడని విమ ర్శించారు. గత 20 నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతుందని, రైతుల ఉసురు రేవంత్‌రెడ్డికి తగులుతుందని రెడ్యానాయక్ విమర్శించారు. బీఆర్ఎస్ ధర్నాతో కిలోమీటర్ మేర ఇరువుపుల వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

● నర్సింహులపేట : మండల కేంద్రంలో పీఏసీఎస్ ఎదుట రైతులు యూరియా కోసం ఉదయం 6 గంటల నుంచి వర్షాన్ని సైతం లెక్కచేయకుండ క్యూలైన్‌లో నిల్చున్నారు. సుమారు 330 యూరియా రాగా, ఒక్కో రైతుకు ఒక్కో బస్తాను అందించారు. బస్తాలు అందని సుమారు 500 మంది రైతులు నిరాశతో ఇంటిముఖం పట్టారు.

● ఇనుగుర్తి: మండల కేంద్రంలో రైతులు యూరియా కోసం మండల కేంద్రంలోని రోడ్డు నిల్చుకుని తమకు యూ రియా అందించాలని ని వాదాలు చేశారు. తెల్లవా రుజామున మూడు గంటలకే రైతు వేదిక వద్దకు చేరుకొని తమ చెప్పులను క్యూలైనులో పెట్టారు. ఉదయం 8 గంటల వరకు కూడా టోకెన్లు పంపిణీ చేయకపోవడంతో ఈరోజు యూరియా రావడంలేదని ప్రచారం జరిగింది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనగా రైతువేదిక ఎదురుగా ఉన్న కేసముద్రం-తొర్రూరు రహదారిపై బైఠాయించారు. సుమారు అరగంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో ఇరువైపులా రాకపోకలు స్తంభించిపోయాయి.

● కేసముద్రం : కేసముద్రం సొసైటీలో 222 యూరియా బస్తాలు రాగా, తెల్లవారుజామునుంచే యూరియా బస్తాల కోసం రైతులు పడిగాపులు కాసారు. యూరియా పంపిణీని ఏడీఏ శ్రీనివాసరావు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ పరిశీలించారు.



ఇనుగుర్తి రైతువేదిక వద్ద యూరియా కోసం చెప్పులను క్యూలో పెట్టిన రైతులు



ఇనుగుర్తి రాస్తారోకోలో రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కరుణాకర్



మరిపెడలో రైతు ధర్నాలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

యూరియా కొరతపై బీఆర్ఎస్ నిరసన



ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

ములుగు టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై ములుగు జిల్లా కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు పోరిక గోవింద్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. 20 ఏళ్ల క్రితం యూరియా కోసం రైతులు ఎలాంటి అవస్థలు పడ్డారో నేడు కూడా అలాంటి పరిస్థితులే పునరావృతమవుతున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా కృతిమ కొరతను సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. ఇప్పటికైనా సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

'దేవాదుల'లో మరో మోటారు ఆన్

కన్నాయిగూడెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. కొన్నిరోజులుగా భారీ వర్షాలు, వరదల కారణంగా పంపింగ్‌ను అధికారులు నిలిపివేయగా సోమవారం ఉదయానికి ఫేజ్-3లో ఒక మోటారును ఆన్ చేశారు. మంగళవారం ఉదయం ఫేజ్-3లో మరోమోటారు ఆన్‌చేశారు. సాయంత్రానికి ఫేజ్-2లో మరో మోటారును ఆన్‌చేసి మొత్తం మూడు మోటార్ల ద్వారా 831క్యూసెక్కుల నీటిని భీంగణపూర్ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 78.30 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

సాయుధ దళ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ



సిబ్బందిని వివరాలు అడుగుతున్న ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయుధ దళ కార్యాలయాన్ని ఎస్పీ శబరీశ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన ఆ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సాయుధ బలగాలు ఎస్పీకి గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం కార్యాలయం పరిసరాలను పరిశీలించిన ఆయన ఉద్యోగులు నిర్వర్తిస్తున్న విధులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అత్యాధునిక ఆయుధాలు గురించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. బీడీ టీం సభ్యులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ సదానందం, ఆర్‌ఐలు స్వామి, సంతోష్, వెంకటనారాయణ, తిరుపతి ఉన్నారు.

ఉత్తమ ఎస్సైగా కమలాకర్



గోవిందరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మండలంలోని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ఉత్తమ జిల్లా ఎస్సైగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా మంగళవారం ములుగులో ఎస్పీ శబరీశ్ చేతులమీదుగా ఆయన ప్రశంసాపత్రం, రివార్డు అందుకున్నారు. అనంతరం ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులను గుర్తించి నగదు బహుమతి, రివార్డులు అందజేస్తున్నారని తెలిపారు. మండలంలో గంజా యి నియంత్రణ, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, పశువుల అ క్రమ రవాణాను అడ్డుకోవడం, పీడీఎస్ బియ్యం తరలించేవారిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెపారరు. ఎస్సై కమలాకర్‌ను డీఎస్పీ రవీందర్, సీఐ దయాకర్, సిబ్బంది అభినందించారు.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ..

తప్పిన ప్రమాదం



కురవి గేట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి స్కూల్ బస్సును అడ్డంగా ఢీకొన్న లారీ

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ పిల్లలతో వెళ్తున్న స్కూల్ బస్సును ఓ లారీ అదుపుతప్పి ఢీ కొనడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మానుకోట జిల్లా కేంద్రంలోని కురవి గేట్ బాబు జగ్జీవన్‌రావ్ జంక్షన్ వద్ద మంగళవారం చోటు చేసుకున్నది. టౌన్ సీఐ జి.మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు 35 మంది పిల్లలతో పాఠశాలకు బయలుదేరింది. కురవి రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో బయ్యారం వైపునకు వెళ్లే లారీ అదుపుతప్పి స్కూల్ బస్సును ఢీకొంది. బస్సు అద్దాలు పగిలి పాక్షికంగా దెబ్బతిన్నది. బస్సులో ఉన్న పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించామని, అజాగ్రత్తగా వాహనం నడిపిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోదావరిలో దూకిన వృద్ధుడు

కుటుంబ సభ్యులు మందలించారని మనస్తాపం



బాపు(ఫైల్)

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్ర జ్యోతి) : కుటుంబ సభ్యులు మందలించారనే మనస్తాపంతో ఓ వృద్ధుడు గోదావరిలో దూకాడు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన మాడిగ బాపు(70) కుటుంబ సభ్యులు మందలిం చడంతో మనస్తాపం చెంది కాళేశ్వరం వద్ద గోదా వరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడని పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

బీజేపీ ములుగు జిల్లా కార్యదర్శిగా మధు

కొత్తగూడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ములుగు జిల్లా కార్యదర్శిగా కొత్తగూడ గ్రామానికి చెందిన తోటకూరి మధు ఎన్నికయ్యాడు. ఈమేరకు మధు ఎన్నికను బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా తోటకూరి మధు మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు ములుగు జిల్లా బీజేపీ నాయకులుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాళేశ్వరాయలంలో మట్టి విగ్రహాల పంపిణీ

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు మట్టి విగ్రహాలను ఈవో మహేష్ మంగళవారం పంపిణీ చేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ఈ ప్రతిమలను అందజేశారు. అర్చకులు నగేష్, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఈవో మహేష్

'ఆశా'లకు నెలకు రూ.18 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధవి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామి ఇచ్చిన విధంగా ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ అనుబంధ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 1న చేపట్టే చలో హైదరాబాద్‌కు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏవో పవన్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు రమాదేవి, ఉపేంద్ర, కరుణ, ఆసియా, విజయ, స్వరూప, రజిత, శ్రీదేవి పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ స్థాపన అందరి బాధ్యత



క్షయ వ్యాధిగ్రస్తులకు విశ్రాంత ఉద్యోగులతో కలిసి పోషకాహార కిట్స్ అందజేస్తున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజ స్థాపనకు ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి భూక్య రవిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సహకారంతో ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనిలో పలువురు క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌వో రవిరాథోడ్ మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తోట శ్రీనివాస్, టీజీజీఆర్‌ఏ అధ్యక్షులు మైస నాగయ్య, కార్యదర్శి వి సోమయ్య, టి అరుణకుమారి, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడి మృతి



రాజు మృతదేహం

బయ్యారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బయ్యారం మండలం పాత కంబాలపల్లి గ్రామానికి చెందిన రాజు(17) గ్రామ సమీప చెరువులో ట్రాక్టర్ కడిగేందుకు తన స్నేహితులతో కలిసి మరో స్నేహితుడు చరణ్‌కు చెందిన ట్రాక్టర్‌పై బయలుదేరుతాడు. ఈ క్రమంలోనే చరణ్ అతివేగంతో అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపతూ సడన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడిన రాజు తలకు బలమైన గాయమైనట్లు ఎస్సై తెలిపారు. తీవ్రంగా గాయపడిన రాజును చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా నేడు వినాయక చవితి పండుగ నేపథ్యంలో గణేష్ విగ్రహాన్ని తీసుకొచ్చేందుకు గాను రాజు స్నేహితులతో కలిసి ట్రాక్టర్ కడిగేందుకు చెరువు వద్దకు వెళ్తుండగా దుర్ఘటన జరిగినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

మహబూబాబాద్ టౌన్,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామి మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం యాదగిరిగౌడ్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఏవో పవన్‌కుమార్‌కు మంగళవారం సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ..... మెనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా క్వింటాకు రూ.300 కమిషన్‌ను పెంచాలని, డీలర్లకు రావాల్సిన ఐదు నెలల కమిషన్‌ను తక్షణమే ఇచ్చి డీలర్లను ఆదుకోవాలని కోరారు. కమిషన్‌ను విడుదల చేయకపోతే సెప్టెంబరు 5న రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులను బంద్ చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, బీర్రు వెంకటనారాయణ, ముంజాల యాకయ్య, గొర్రె వెంకన్న, జిన్నారపు రాం చందర్‌రావు, గుగులోతు వేణుగోపాల్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఏవో పవనకుమార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న రేషన్ డీలర్లు

అడవిలో చిక్కుకున్న యువకుడు..

సురక్షితంగా తీసుకొచ్చిన అధికారులు

వెంకటాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం అటవీ ప్రాంతంలో ముత్యంధార జలపాతాన్ని తిలకించేందుకు వెళ్లిన పర్యాటకుడు తప్పిపోయాడు. అతడిని అటవీశాఖ అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన యువకుడు అబ్రార్ హుస్సేన్ సోమవారం ఉదయం ముత్యంధార జలపాతాన్ని తిలకించేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేక్రమంలో కాలుకు గాయం కావడంతో నడవలేక అటవీ ప్రాంతంలో చిక్కుకున్నాడు. రాత్రి కావడంతో అబ్రార్ హుస్సేన్ డయల్ 100కు సమాచారం అందించాడు. దీంతో రాత్రి ముత్యంధారకు వెళ్లే అటవీ మార్గంలో అతడి కోసం ఫారెస్టు అధికారులు గాలించాలి. ఈక్రమంలో మంగళవారం తెల్లవారుజామున అబ్రార్ హుస్సేన్‌ను గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చినట్లు వారు తెలిపారు. అబ్రార్ హుస్సేన్ తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు.



పర్యాటకుడితో అటవీశాఖ అధికారులు





జయములివ్వు బొజ్జ గణేశా!

నేడు వినాయక చవితి పర్వదినం

నవరాత్రి వేడుకలకు వాడవాడనా సిద్ధమైన మండపాలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జై గణేశా.. జై జై గణేశా.. అంటూ చేసే పూజలకు సమయం ఆసన్నమైంది. భాద్రపద శుద్ధ చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం గణేష్ చతుర్థి పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు ఇంటింటా ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అలాగే వాడవాడనా గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు మండపాలు సిద్ధమయ్యాయి. వినాయక చవితి అంటేనే ప్రకృతి సిద్ధమైన పండుగ. పిండి వంటలతో వివిధ రకాల పత్రులతో సంప్రదాయ బద్ధంగా జరుపుకుంటారు. లంబోదరుడిని పత్రులతో పూజిస్తే విశేష ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. 21 రకాల పత్రులతో స్వామిని పూజిస్తారు. ఇందుకు సంబంధించిన పత్రులు, పండ్లు, పూల కొనుగోళ్లతో బజార్లన్నీ సందడిగా మారాయి. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో వినాయక విగ్రహాల అమ్మకాలు కొనసాగుతున్నాయి. చిన్న నుంచి పెద్ద విగ్రహాల వరకు భారీగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఎంజీఎం సెంటర్, భద్రకాళి ఆర్చ్, కేఎంసీ సెంటర్ వద్ద నుంచి భారీ గణపతి విగ్రహాలను ప్రత్యేక వాహనాల ద్వారా మండపాలకు తరలిస్తున్నారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం గణేష్ మండళ్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో నిర్వాహకులు విద్యుత్ దీపాలను పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో 6 ఫీట్ల మట్టి గణపయ్యను చౌరస్తాలోని పున్నంచందర్ స్వగృహం నుంచి బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మేళతాళాలతో తీసుకువచ్చి ప్రతిష్ఠింపజేయనున్నట్లు ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో గణేష్ నవరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలను అలంకరింపజేయడమే కాక తొమ్మిది రోజులపాటు వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. హనుమకొండలోని టైలర్‌స్ట్రీట్, సుధానగర్, రెవెన్యూ కాలనీ, సుబేదారి, ఎక్సైజ్ కాలనీ, బ్రాహ్మణవాడ, రాగన్నదర్వాజ తదితర ప్రాంతాల్లో సుమారుగా వేయికి పైగా గణేష్ మండపాలు వెలిశాయి.



బట్టల బజార్‌లో పూజ సామగ్రి కొంటున్న మహిళలు



ఎంజీఎం సెంటర్‌లో వినాయక విగ్రహాల కొనుగోళ్లు

నగరంలోని అన్ని ప్రధాన అపార్ట్‌మెంట్లలోనూ గణేష్ ప్రతిమలకు పూజలు నిర్వహించనున్నారు. అలాగే వరంగల్ పిన్నవారి వీధి, బట్టల బజార్, రామన్నపేట, రైల్వే గేట్, గీతా భవన్, దుర్గేశ్వరాలయం, జేపీఎన్‌రోడ్డు, చౌరస్తా, పోచమ్మమైదాన్, కొత్తవాడ, కాశిబుగ్గ, చమన్, మార్కెట్, దేశాయిపేట, లేబర్‌కాలనీ, కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేట, శివనగర్, ఓసిటీ, బ్యాంకు కాలనీ ప్రాంతాలతో పాటు వ్యాపార సంస్థలు, దేవాలయాల్లో, ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతి మండపాలను ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించడానికి సిద్ధం చేశారు.

పూలు పండ్లకు భలే గిరాకీ..

వినాయక పండుగ వచ్చిందంటే ఎటుచూసినా సందడే ఉంటుంది. వినాయక విగ్రహాలతో పాటు పిండి వంటలు, కూరగాయలు, పండ్లు నైవేద్యంగా స్వామికి ఆరగింపు చేసి బొజ్జ గణపయ్యకు ప్రీతికరమైన ఉండ్రాళ్లను తయారు చేసి పూలు, పండ్లతో అలంకరిస్తారు. దీంతో పూలు, పండ్లు, కూరగాయలకు భలే గిరాకీ ఉంటుంది. కిలో చామంతి పూలు, గులాబీలు రూ. 400 నుంచి 500 వరకు పలికాయి. వినాయక విగ్రహాలకు అలంకరించడానికి భారీ గజమాలలను తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఇక కొబ్బరికాయ ధర కొండెక్కింది. ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు.

5వ తేదీనే నిమజ్జనం

ప్రతిసారి గణేష్ నవరాత్రి వేడుకల అనంతరం 10, లేదా 11వ రోజు నిమజ్జనం చేసే సాంప్రదాయం ఉంది. అయితే ఈసారి 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున సిద్ధాంతులు, పంచాంగకర్తలు 8 రాత్రులు పూర్తయిన క్రమంలో 9వ రోజునే అంటే సెప్టెంబరు 5వ తేదీ శుక్రవారం నిమజ్జనం చేయాలని తేల్చిచెప్పడంతో ఈసారి ఉమ్మడి జిల్లాలో 5వ తేదీన నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మట్టి గణపయ్యల పంపిణీ

పర్యావరణానికి విఘాతం కలిగించకుండా మట్టి గణపతులను ప్రతిష్ఠింపజేయాలన్న ప్రభుత్వ సూచనల మేరకు నగరంలోని పలు విద్యాసంస్థలతోపాటు స్వచ్ఛంద సంస్థలు పోటీలుపడి మంగళవారం బుల్లి మట్టి గణపతులను అనేక ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీ చేశారు. ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ ఇచ్చిన పిలుపుమేరకు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో 300 మట్టి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. వరంగల్ చౌరస్తాతో పాటు ఆలయాల్లో, భద్రకాళి దేవాలయంలో మట్టి గణపతులను ఉచితంగా అందజేశారు. అదే విధంగా హనుమకొండ జూలైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలతోపాటు అనేక పాఠశాలల్లో మట్టి గణపతులను విద్యార్థులకు అందజేశారు.



వినాయక చవితిని పురస్కరించుకొని హనుమకొండ రాంనగర్‌లోని ఓ పాఠశాలలో చిన్నారులను శివపార్వతులు, గణేశుడు, కుమారస్వామిగా అలంకరించిన దృశ్యం






జూలైవాడ ఉన్నత పాఠశాలలో మట్టి గణపతులతో విద్యార్థులు



ఎంజీఎం సెంటర్ నుంచి గణపతి విగ్రహాలను తీసుకువెళ్తున్న దృశ్యం

లడ్డూ ప్రసాదం సిద్ధం



కలశం అలంకరణలో ప్రత్యేక లడ్డూ



శివలింగాకారంలో ప్రత్యేక లడ్డూ



విక్రయానికి సిద్ధంగా ఉంచిన భారీ లడ్డూలు

- 100 గ్రాముల నుంచి వంద కిలోల వరకు తయారీ
- పండుగకు 5 టన్నుల లడ్డూల విక్రయాలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం రోజున ప్రతీ ఇంటా, ప్రతీ గణపతి మండపంలో స్వామివారికి ప్రీతికరమైన లడ్డూను నైవేద్యంగా పెడతారు. ఇందుకోసం భక్తులకు విక్రయించడానికి వ్యాపారులు ప్రత్యేక లడ్డూలు తయారు చేశారు. బట్టల బజార్‌లోని ఓ మిఠాయి దుకాణంలో దాదాపు 5 టన్నుల లడ్డూలను తయారు చేసి విక్రయించడానికి సిద్ధం చేశారు. ప్రత్యేక ఆకర్షణగా శివ లింగం లడ్డూ, కలశం లడ్డూ తదితర రకాల లడ్డూలను తయారు చేశారు. 100 గ్రాముల నుంచి వంద కిలోల వరకు తయారు చేసి ఆర్డర్‌పై అందజేస్తున్నారు.

పుచ్చ గింజపై గణనాథుడు

మైక్రో ఆర్టిస్ట్ కుసుమ లింగమూర్తి సృష్టి



కుసుమ లింగమూర్తి

వరంగల్ సిటీ, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాశిబుగ్గ సాయిగణేష్ కాలనీకి చెందిన మైక్రో ఆర్టిస్ట్ కుసుమ లింగమూర్తి పుచ్చ గింజపై వినాయకుడి చిత్రాన్ని చిత్రీకరించారు. లింగమూర్తి గతంలో బియ్యపు గింజపై శ్రీరాముడు, శనగపప్పు పలుకుపై వివేకానందస్వామి చిత్రాన్ని గీసి ఆకట్టుకున్నారు. ఇపుడు వినాయకుడి చిత్రాన్ని గీశారు. దీంతో ఆయనను కాలనీ వాసులతో పాటు అలయెన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.



పుచ్చ గింజపై వినాయకుడి చిత్రం

నాట్య గణపతి సూక్ష్మశిల్పం

మట్టెవాడ ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు చెందిన అంతర్జాతీయ సూక్ష్మ శిల్ప కళాకారుడు మట్టెవాడ అజయ్‌కుమార్‌కు సూది రంధ్రంలో, కనురెప్ప వెంట్రుకలపైన, గుండు సూదిపైన శిల్పాలు చెక్కడంలో నైపుణ్యం ఉంది. ప్రస్తుతం వినాయక చవితిని పురస్కరించుకుని కనురెప్ప వెంట్రుక చివరన నాట్యం చేస్తున్న వినాయకుడి సూక్ష్మ శిల్పం చెక్కారు. ఇది 0.37 ఎంఎం (370 మైక్రాన్స్) ఎత్తు మాత్రమే ఉంటుంది. కేవలం మైక్రో స్కోపుతోనే వీక్షించవచ్చు. దీన్ని తయారు చేసేందుకు మెత్తని మైనం, ఇసుక రేణువులు, ప్లాస్టిక్ పౌడర్, స్వయంగా తయారు చేసుకున్న సూక్ష్మ పరికరాలు, రంగులు అద్దడానికి గొంగళి పురుగు వెంట్రుకను ఉపయోగించారు. ఇది తయారు చేయడానికి 120 గంటల సమయం పట్టిందని అజయ్‌కుమార్ తెలిపారు.



కనురెప్ప వెంట్రుక అంచున నాట్య గణపతి సూక్ష్మ శిల్పం



కళాకారుడు అజయ్‌కుమార్

మట్టితో 'సిందూర్' గణపతి

నర్సంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ కామోజు జయకుమార్ పర్యావరణ పరిరక్షణ కోసం పదిహేడు సంవత్సరాలుగా విభిన్న సూక్ష్మ గణపతులను తయారు చేస్తున్నారు.

ఈ సంవత్సరం రెండు అంగుళాల కన్నా తక్కువ పరిమాణంలో సైనికుడి రూపంలో వినాయకుడి ప్రతిమను తయారు చేశాడు. మట్టితో చేసి వాటర్ కలర్స్‌తో తీర్చిదిద్దారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని జయకుమార్ కోరారు.



జయకుమార్



మట్టితో తయారు చేసిన సిందూర్ గణపతి

విత్తన మట్టి గణపతులు

తయారు చేసిన పర్యావరణవేత్త రామస్వామి

నర్సంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పర్యావరణవేత్త గోక రామస్వామి పిలుపునిచ్చారు. గత 40 సంవత్సరాలుగా తాను తయారు చేయడంతో పాటు విద్యార్థులతో మట్టి విగ్రహాలను తయారు చేసి వినాయక చవితి రోజు ఉచితంగా అందిస్తున్నారు. ఈ ఏడాది మట్టితో విత్తన గణపతులను తయారు చేశారు. ప్రతీ మట్టి విగ్రహంలో పనస, స్టార్ ఫ్రూట్, నేరేడు, ఉసిరి, సీతాఫలం వంటి పండ్ల విత్తనాలను పెడుతున్నారు. విత్తన మట్టి విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత మట్టి కరిగిపోయి విత్తనాలు మొలకెత్తుతాయన్నారు. ప్రజలు మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని రామస్వామి కోరారు. నేడు విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.





విత్తన మట్టి గణపతి విగ్రహాలను చూపుతున్న గోక రామస్వామి

ఉన్నత విద్యాప్రమాణాలే ఎన్ఐటీ లక్ష్యం

- విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయం
- డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి
- ఘనంగా యూజీ విద్యార్థుల ఓరియంటేషన్



అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్ఐటీ అత్యున్నత విద్యా ప్రమాణాలను కొనసాగించడానికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. నిట్‌లో కొత్తగా ప్రవేశం పొందిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. 1245 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, బహుముఖ వికాసమే ఎన్ఐటీ ప్రధాన లక్ష్యం అన్నారు. నిట్ క్యాంపస్‌లోకి కొత్తగా అడుగుపెట్టిన విద్యార్థులు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలనీ, తద్వారా దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని పిలుపు నిచ్చారు. నిట్ కళాశాల విశిష్టత, దేశంలో అగ్రగామి విద్యా సంస్థగా ఎదగడం వెనుకగల నేపథ్యాన్ని, కృషిని వివరించారు. అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి క్యాంపస్ జీవితం, విద్యార్థులు పాటించాల్సిన నియమ నిబంధలను వివరించారు. విద్యార్థుల స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె.కిరణ్ కుమార్ నిట్ విద్యార్థుల సంక్షేమం కోసం కళాశాల తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి హరి ప్రసాద్ రెడ్డి క్యాంపస్‌లో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, కళారంగాల్లో వారు రాణించడానికి ఏర్పాటు చేసిన వివిధ క్లబ్‌ల గురించి పరిచయం చేశారు. చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ అబ్దుల్ అజీం హాస్టల్ జీవితం గురించి చెప్పారు. కెరీర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ అధిపతి ప్రొఫెసర్ పీవీ.సురేష్ క్యాంపస్ ప్లేస్‌మెంట్, ఉద్యోగావకాశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల సందేహాలకు వివిధ విభాగాల అధిపతులు నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులు తమ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా విభాగాధిపతులు విద్యార్థులకు స్వాగతం పలుకుతూ అధ్యాపకులను, ఫ్యాకల్టీ సలహాదారులను పరిచయం చేశారు.

అంతర్‌జిల్లా చైన్ స్నాచర్ అరెస్టు

- రూ. 23.56 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్ సీజ్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని కేయూసీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.23.53 లక్షల విలువైన 237 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 3 ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్, రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ స్నాచింగ్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన మంతుర్తి హరీశ్ డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ సిమెంట్ కంపెనీలో క్వాలిటీ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. ఆ సమయంలో కంపెనీలో ఇంజనీరింగ్ పని చేస్తున్న ఉద్యోగి ఇంట్లో బంగారు గొలుసు చోరీ చేసి మణప్పురం గోల్డ్‌లోన్ కంపెనీలో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈ కేసులో నెరెడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. బెయిల్‌పై వచ్చిన నిందితుడు జల్సాల కోసం రోడ్డుపై ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో నుంచి చైన్ స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. నిందితుడు ముందుగా చైన్‌స్నాచింగ్‌ల కోసం ద్విచక్రవావాహనాలు చోరీ చేయాలనుకున్నాడు. వెంటనే హనుమకొండ రెడ్డికాలనీలోని కిరాయి ఇంట్లోకి మకాం మార్చి వరంగల్ కమిషనరేట్‌లోని కేయూసీ, రాయపర్తి, సుబేదారి, కాజీపేట, హసన్‌పర్తి, కమలాపూర్‌తో పాటు కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌లో చైన్ స్నాచింగ్ చేయడంతో పాటు హనుమకొండ, హసన్‌పర్తి, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో 3 ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. వరుస స్నాచింగ్‌లపై అప్రమత్తమైన సీసీఎస్, కేయూసీ పోలీసులు మంగళవారం ఉదయం యాదవనగర్ క్రాస్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డట్టు ఒప్పుకోవడం జరిగిందన్నారు.

నిందితుడు కిరాయి ఉంటున్న ఇంటి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, క్రైం డీసీపీ గుణశేఖర్, ఏసీపీ సదయ్య, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, సీఐలు, సీసీఎస్, కేయూసీ సిబ్బంది పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా ఆశయాలను కొనసాగించాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మాతృమూర్తి మదర్‌థెరిస్సా ఆశయాలను కొనసాగించాలని మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. రైల్వే స్టేషన్ సెంటర్‌లోని మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జయంతి కేక్‌ను కట్ చేశారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్, వైఎంసీఏ బాధ్యులు జన్ను మహేందర్, అను దీప్, ప్రవీణ్, శశిధర్, మహ్మద్ రఫీక్, తిప్పర్తి శ్రీధర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మండలం సికింద్రాబాద్ తండాలోని ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో మదర్‌థెరిస్సా విగ్రహానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి శిరీష పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● హెచ్ఎంఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ జీవీ. ఇశ్రాయేలు, పి. జాన్‌విక్టర్, ఎం.ప్రణయ్, ఎస్.ఆజాద్ పాల్, టైటస్ తదితరులు పాల్గొన్నారు.

● కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని శ్రీ వివేక వర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను న్విహించారు.

● డోర్నకల్ గాంధీ సెంటర్‌లో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల కోర్టు సెకండ్ క్లాస్ అడిషన ల్ మెజిస్ట్రేట్ కొప్పుల శంకర్, సంగాల మత్తై, సుమీర్‌చందద్‌జైన్, మార బోయిన లక్ష్మీనారాయణ, దాసరి నాని, గుండోజు లవన్ పాల్గొన్నారు.

● బయ్యారం: బయ్యారం బాలికల ఉన్నత పాఠశాల నందు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 నోటు పుస్తకాలుతో పాటు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రధానకార్యదర్శి పర్కాల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బయ్యారంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిప్యూటీ షో డాక్టర్ సుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో 310 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలు ఉన్న 40 మంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మరో ఎనిమిది మంది విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం జిల్లా ప్రధాన ఆస్పత్రి ల్యాబ్‌కు పంపించారు. అనంతరం కళాశాలలో ఏఎంఎం స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌రెడ్డి పలు సూచనలు చేశారు సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డేబోయిన శ్రీనివాస్, డాక్టర్ ఝాన్సీ కళాశాల ప్రిన్సిపల్ బిందుమాధురి ఉన్నారు.

మట్టెవాడ ఆశ్రమ పాఠశాల తనిఖీ

గూడూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :గూడూరు మండలంలోని ఊట్ల మట్టెవాడ గిరిజన ఆశ్రమ పాఠశాలను ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదితో పాటు కిచెన్, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధనపై ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచి, శుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం, సిబ్బంది ఉన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు

గార్ల ఆగష్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్త పోచారం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు వివిధ రకాల వ్యాధులకు టీకాలు వేయడం జరిగింది. గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలతో పాటు చూడి పరీక్షలు, నట్టల నివారణ, అదేవిధంగా గొర్రెలకు మేకలకు చీడ పారుడు, పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు అందంచడం జరిగింది. ఈసందర్భంగా గార్ల పశువైద్యాధికారి వి.సురేష్ మాట్లాడుతూ ఈనెల 26 నుండి సెప్టెంబర్ 10వరకు గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి టీకాలు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం గ్రామంలో 750 గొర్రెలకు పీపీఆర్ వ్యాధి టీకాలు ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది శేఖర్, చందూలాల్, సంజీవ్, వేణు పలువురు రైతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం



రేషన్‌కార్డు పత్రాలను అందజేస్తున్న గంట సంజీవరెడ్డి

కేసముద్రం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా కొత్త రేషన్‌కార్డులను అందజేయడమేకాకుండా వారికి సన్నబియ్యం పంపిణీ చేస్తోందని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని కల్వల గ్రామపంచాయతీలో మంగళవారం 60 మందికి కొత్త రేషన్‌కార్డుల లేఖలను చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని, అర్హులందరికీ ఇప్పుడు వచ్చాయని, వీరికి వచ్చేనెల 1న సన్నబియ్యం పంపిణీ చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, పెదగాని రవి, కొమ్మాల జయేందర్‌రెడ్డి, దినేష్ పాల్గొన్నారు.

గణపతి పూజకు వేళాయె..

(5వ పేజీ తరువాయి)

విగ్రహాలను ఇప్పించనున్నారు. యువతను అనుకూలంగా మార్చుకునేందుకు ఇదొక అవకాశంగా ఉపయోగించుకోనున్న తరుణంలో విగ్రహాల ధరలను పెంచే అవకాశాలు లేకపోలేదు. ప్రజలు ఈ ఏడాది వేడుకల నిర్వహణకు ఆసక్తి కనబరచడంతో విగ్రహాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సుమారు రూ. 2 వేల నుంచి రూ. 20 వేల వరకు విక్రయిస్తున్నారు. దీంతో నాయకులు తప్పనిసరి పరిస్థితుల్లో విగ్రహాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. నేడు(బుధవారం)మండపాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు జిల్లా నలుమూలల నుంచి యువకులు, ప్రజలు వచ్చి విగ్రహాలను తీసుకువెళ్లేందుకు అందుబాటులో ఉంచారు. గతేడాదిలో ప్రతిష్ఠించిన విగ్రహాల కంటే ఈ సారి రెట్టింపు స్థాయిలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. కాగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. గత నాలుగు దశాబ్ధాలుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రూపొందించిన గణనాథుడి విగ్రహాలను వాడ వాడల ఏర్పాటు చేస్తుండడంతో వాటి వల్ల పర్యావరణ పరంగానే కాకుండా తాగునీరు కలుషితమవుతోంది. దీని పర్యవసానాలు మరిన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా మనకు కనబడుతున్న క్రమంలో ఇకనైనా మట్టి ప్రతిమను సహజ రంగులతో ఉన్న గణనాథుల్ని పూజించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

● పూజా సామగ్రికి గిరాకీ..

విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఉపయోగించే పూజా సామగ్రికి గిరాకీ ఉంది. పూజలో ఉపయోగించే మారేడుకాయ, వెలగకాయ, మారేడు, ఉత్తరేణి, జామ ఆకులు, గరక, ముగ్గుపువ్వు, మామిడి ఆకులు కలిపి రూ. 100కు విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ స్వీట్ హౌజ్‌లో వినాయకుడి విగ్రహం వద్ద ఉంచేందుకు కిలో నుంచి 11 కిలోల వరకు లడ్డూలు అందుబాటు లో ఉంచారు. వీటి ధర కిలోకు రూ. 280 నుంచి రూ. 300 వరకు ఉంది.

నానో యూరియాతో అద్భుత ప్రయోజనాలు

గూడూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియా వాడకం వల్ల దిగుబడితో పాటు అద్భుత ప్రయోజనాలు ఉన్నాయని గూడూరు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్ అన్నారు. గూడూరు సొసైటీ వద్ద నానో యూరియాపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. అత్యంత ప్రయోజనాలు కలిగిన నానో యూరియాను రైతులు తమ పంటలకు వేసుకోవాలన్నారు. సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ మోతాదులో వాడకం వల్ల మట్టి, నీటి కాలుష్యం తగ్గిస్తుందన్నారు. సొసైటీ సీఈవో రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● డోర్నకల్ : రైతులు తమ పంట పొలాల్లో నానో యూరియాను వేసుకోవడం వల్ల పంట దిగుబడి బాగా వస్తుందని డోర్నకల్ మండల వ్యవసాయాధికారి మురళీమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. నానో యూరియా మొక్కలకు పోషకాలను అందించడంలో సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండ కాపాడుకోవచ్చని చెప్పారు. రైతులు యూరియాను అధిక మోతాదులో వేయకూడదని సూచించారు.

సులభ బోధనకు టీఎల్ఎం దోహదం : కలెక్టర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేందుకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణతో ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చేసిన టీఎల్ఎం ఎంతో ఆకర్షణీయంగా ఉందని ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లాస్థాయి పోటీలకు 18 మండలాల నుంచి 180 ఎగ్జిబిట్లు వచ్చాయని, వాటిలో ఉత్తమమైన ఎగ్జిబిట్లను తెలుగు, ఇంగ్లీష్, పరిసరాల విజ్ఞానం, గణితం సబ్జెక్టుల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 8 ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, డీఎస్‌వో అప్పారావు, ఏఎస్పీ సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టీఎల్ఎం మేళాను సందర్శించిన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పోరాట సభను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లలితా కళాతోరణంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుపతలపెట్టిన పాత పెన్షన్ సాధన పోరాట సభను జయప్రదం చేయాలని టీఎస్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమ్మి నాగబ్రహ్మాచారి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో మంగళవారం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగబ్రహ్మచారి మాట్లాడుతూ. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీజనరల్ ఏలూరు శ్రీనివాస్ నేతృత్వంలో జరిగే బహిరంగ సభకు ప్రతి ఉద్యోగి హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, ఆరోగ్యశాఖ ఫోరం నేతలు రామాంజనేయులు, రవి ప్రసాద్, స్వప్న, కాసావి, రమ్య, భరత్, నవీన్, యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై తప్పించుకుంటున్న ప్రభుత్వాలు

కేసముద్రం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యూరియా కొరతపై రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు తప్పును నెట్టుకుంటూ తప్పించుకుంటున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు శివారపు శ్రీధర్ ఆరోపించారు. యూరియా కొరతను నివారించాలని కోరుతూ కేసముద్రం, ఇనుగుర్తి సంయుక్త మండలాల కార్యదర్శి కొట్టం అంజయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివారపు శ్రీధర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సాగుకు అవసరమయ్యే యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. భట్టు నాగేశ్వర్‌రావు, వాంకుడోత్ హతీరాం, బొమ్మగాని వెంకన్న, నూకల లింగస్వామి, అంబటి నాగమల్లు, బెజ్జంకి బ్రహ్మచారి, బండి రాజు, సీహెచ్.వెంకటేష్ పాల్గొన్నారు.

మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి : ఎమ్మెల్యే



మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణ పతులనే ప్రతిష్ఠించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగ ళవారం ఉచితంగా మట్టి గణపతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి గణపతులను ఏర్పాటు చేసి పూజించాలన్నారు. గణేష్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు సోమరాజశేఖర్, తునం శ్రవణ్, పెదగాని సోమయ్య, బిజ్జాల అనిల్, సూరిబాబు, వెంకన్న, మహేశ్వరి, నాయకులు ఉన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొద్దుటూరి గౌరీశంకర్, వాసవీ క్లబ్ తొర్రూరు అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్ కోరారు. మంగళవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతులు అందించారు. వాసవీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ రామ ఉపేందర్, బిజ్జాల అనిల్, రాంబాబు, నిరంజన్, రవి, సోమన్న, భాస్కరాచారి పాల్గొన్నారు.

● మరిపెడ : మట్టి గణపతులనే పూజించాలని మరిపెడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అనంతరావు అన్నారు. మంగళవారం మరిపెడ హైస్కూల్ విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● బయ్యారం : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మట్టి గణపతులనే పూజించాలని బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమణి సూచించారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి గణపతులే మేలని సూచించారు. పర్యావరణహితమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సంతోష్, అధ్యపకులు స్నేహ, వెంకటలక్ష్మీ, సదాశివుడు, మనోజ్ కుమార్, బాబులాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో పారిశుధ్య నిర్వాహణ లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆరోపించారు. మహబూబాబాద్ మునిసిపల్ కేంద్రంలోపి పలు వీధులను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ... మునిసిపాలిటీ పాలక మండలి పదవీ కాలం పూర్తయిన తర్వాత గత ఆరునెలలుగా పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్ఎస్ మాజీ వార్డు కౌన్సిలర్లు మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్లు మార్నేని వెంకన్న, ఎమ్డీ. ఫరీద్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, గద్దె రవి, చిట్యాల జనార్దన్, ఎడ్ల వేణు, మార్నేని రఘు, సలీం, తేళ్ల శ్రీను, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, దారా యాదగిరి రావు, బూర్ల ప్రభాకర్, డౌలాగర్ శంకర్,దాసరి రావిష్, కర్పూరపు గోపి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చీకటాయపాలెం, చెర్లపాలెం, గోపాలగిరి, కంఠాయపాలెం, అమ్మాపురం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, సోమేశ్వర్‌రావు, సోమరాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పెద్దవంగర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చింత సృజన్, రంగు రాములు గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరాచారి అధ్యక్షతన వినతిపత్రాన్ని తహసీల్దార్ వీ మహేందర్‌కు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నేడు యూరియా కొరత ఏర్పడిందన్నారు. కొడకండ్ల మండల అధ్యక్షుడు జాటోత్ శంకర్, మండల ప్రధాన కార్యదర్శి ముఖేష్‌గౌడ్, తలారి సోమయ్య, శంకర్, వెంకన్న, బాలు, కిరణ్, గణేష్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను వ్యాపారులకు కేటాయించాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రం నడిబొడ్డున నిర్మించిన మోడల్ మార్కెట్‌ను కూరగాయల వ్యాపారులకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో మోడల్ మార్కెట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ...రూ.5.40 కోట్లు వెచ్చించి నిర్మించిన మోడల్ మార్కెట్‌ను గాలికి వదిలేశారని తెలిపారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందించారు. సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, హేమ పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా అన్నం ఫౌండేషన్



ఫౌండేషన్‌కు తరలిస్తున్న శ్రీనివాస్ తదితరులు

గార్ల, 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గత కొద్ది రోజులు భిక్షాటన చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్న ఇరువురు అనాథ అభాగ్యులను సీపీఎం జిల్లా నాయకుడు, కందునూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ పోలీసుల సహకారంతో ప్రత్యేక చొరవ చూపి ఖమ్మం జిల్లా కేంద్రంలోని అన్నం ఫౌడేషన్‌కు తరలించారు. గార్ల మండల కేంద్రంలో ప్రతి రోజు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిని మానవత ధృక్పదంతో వాహనం సిద్ధం చేసి ఇరువురుని ఖమ్మం అనాథ ఆశ్రమానికి తరలించారు. వీరిని ఖమ్మం తరలించడంపై పట్టణ ప్రజలు శ్రీనివాస్, లక్ష్మణ్ నాయక్‌లను అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలతో మేలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని మునిసిప ల్ కమిషనర్ టి.రాజేశ్వర్ అన్నారు.మానుకోట మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులు, సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కాకుండా మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో ఆదేశాలతో మునిసిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్ నేతృత్వంలో నెహ్రూసెంటర్, మదర్ థెరిస్సా సెంటర్లలో 2500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్ర మాల్లో శాటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్‌లో భాగంగా ఏకో ఫ్రెండ్లీ గణపతి విగ్రహాలను తయారు చేశారు. ఏకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, బి. శ్రీధర్, శ్రీనివాసరావు, తిరుపతి, శిభారాణి, సతీష్‌కుమా ర్, సోమేశ్వర్, ఝాన్సీ, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కమిషనర్ టి.రాజేశ్వర్

జిల్లాలో ఎడతెరిపి లేని ముసురు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా అంతటా ముసురు ఆలుముకుంది. కేసముద్రం, బయ్యారం, గూడూరు, కొత్తగూడతో పాటు ఇతర మండలాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు పడుతూనే ఉంది. మధ్య..మధ్యన ముసురుస్థాయి నుంచి చిన్నపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది.

29న ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి స్పాట్ ప్రవేశాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ (జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ) ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరం ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 29న స్పాట్ ప్రవేశాలు కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బలరాంనాయక్ మంగళవారం తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డేటా సైన్స్‌లో-35, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో-28, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్-47, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-58, మెకానికల్ ఇంజనీరింగ్-59 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ మెమోలు, స్టడీ సర్టిఫికెట్, టీజీఈఏపీసెట్ -2025 ర్యాంకు కార్డు, కుల, నివాస సర్టిఫికెట్లతో పాటు టీసీలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సిలిండర్ మాయం

నర్సింహులపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రం 2లో గ్యాస్ సిలిండర్ మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వ చ్చింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం-2ను నిర్వహిస్తున్నారు. అందులో పని చేస్తున్న ఆయా నెల రోజుల నుంచి రాకపోవడం అంగన్‌వాడీ టీచర్ ఈ నెల 22, 23న సెలవుల్లో ఉంది. 24న టీచర్ కేంద్రానికి వచ్చి చూడగా సిలి ండర్ కనిపించలేదు. టీచర్ ఉపేంద్ర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేంద్రానికి తాళం వేసి ఉండగా సిలిండర్ ఎలా మాయం అవుతుందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

సెప్టెంబర్ 3న వాహనాలకు వేలం

నెహ్రూసెంటర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సారా, బెల్లం అక్రమ రవాణా కేసులలో పట్టుబడిన వాహనాలకు సెప్టెంబర్ 3న వేలం వేయనున్నట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉదయం 10 గంటలకు మహబూబాబాద్ ఎక్సైజ్ కార్యాలయం లో వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు వాహనాల వివరాలు ఎక్సైజ్‌స్టేషన్‌లో పొందాలని, ముందుగా వాహనాలను సరిచూసుకుని వేలం పాటలో పాల్గొనాలని చెప్పారు. వేలం పాటలో పాల్గొని ఒకవేళ వాహనం రాకుంటే వారికి డీడీ తిరిగి ఇవ్వబడునని చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు, వాహనం కొనుగోలు దారులు వాహన ప్రైజ్‌రేటులో 50 శాతం డీడీని ముందుగానే చెల్లించాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ సమర్పించాలన్నారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. 3న దరఖాస్తులను తీసుకోబోమని వెల్లడించారు. వాహనం తీసుకున్న కొనుగోలుదారుడు అదే రోజు మొత్తం అమౌంట్‌ను జీఎస్టీ 12 శాతం కలిపి చెల్లించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రతి పాదనలు మండల విద్యాశాఖాధికారి నుంచి కోరబడుచున్నవని తెలిపారు. అట్టి ప్రతిపాదనలతో పాటు వారిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో లేవని, ఎలాంటి పెండిగ్ కోర్టు కేసులు లేవని ధృవీకరించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ నెల 29 సాయంత్రం 4 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

కేసముద్రం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పీహెచ్‌సీలో కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నంబికిషోర్‌కు ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కేసముద్రం మునిసిపాలిటీ అయినందున ఇక్కడి ఆస్పత్రిలో రోగుల సౌకర్యం కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాసు సాయిచరణ్, ఎస్‌కె.ఇమాం, జూకంటి రవి పాల్గొన్నారు.

దివ్యాంగురాలి ఇంటి నిర్మాణానికి సాయం

కేసముద్రం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ సబ్‌స్టేషన్‌తండా సురేష్‌నగర్‌కాలనీలో నిరుపేద కుటుంబం అయిన ఆదియాకయ్య ఇటీవల మృతి చెందడంతో దివ్యాంగురాలైన ఆయన భార్య శ్రీలత ఇంటి నిర్మాణం కోసం తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బాదావత్ పవన్‌కళ్యాణ్ సహాయం అందించారు. రూ.15వేల విలువైన రేకులు, ఇతర సామాగ్రిని అందజేశారు. నిరుపేద దివ్యాంగురాలికి సహాయం చేయడంపట్ల తండావాసులు పవన్‌కళ్యాణ్‌ను అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తొర్రూరులో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సమస్యలు సైతం పరిష్కరించలేని ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. . కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, నాయకులు పూసల శ్రీమాన్, పల్లె కుమార్, రవిబాబు, విజయ్‌కుమార్, చలపతిరావు, అశోక్, రాంబాబు, నవీన్, సురేష్ తదితరులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సోమ వసూద ఇటీవల మృతి చెందడంతో ఆమె పేరుపై ఉన్న ఇన్సూరెన్స్ చెక్కును ఆమె కుటుంబసభ్యులకు పోస్టల్ శాఖ అధికారులు అందజేశారు. మహబూబాబాద్ హెడ్‌పోస్టాఫీసులో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో వరంగల్ డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ రవికుమార్ సోమ వసూద తల్లిదండ్రులు పద్మావతి-వీరభద్రయ్యలకు అందించారు. 2022 సంవత్సరంలో రూ.10 లక్షల పోస్టల్ ఇన్సూరెన్స్ చేశారు. దాంతో ఆమెకు రూ.11,23,490 ఇన్సూరెన్స్ మంజూరు అయింది. మంజూరైన చెక్‌ను తల్లిదండ్రులకు అందించారు. గోవర్ధన్, వాసం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.